ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	40.1	28.6
కావలి	37	28
ఆత్మకూరు	40	27
ఉదయగిరి	39	27
కందుకూరు	37	29



తప్పు తేలినా శిక్షలేవీ ?

- గ్రేడ్-1 పంచాయతీల్లో భారీగా నిధుల దుర్వినియోగం
- విచారించి నిగ్గుతేల్చిన జిల్లా అధికారులు
- పదిమందిపై కమిషనరేట్‌కు నివేదికలు
- ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు శూన్యం
- డబ్బులిచ్చి మేనేజ్ చేసుకుంటున్నట్లు ఆరోపణలు
- జిల్లాస్థాయిలో వెంటనే వేటువేస్తున్న కలెక్టర్

నెల్లూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : 'నవ్విపోదురుగాక మాకేంటి'.. అన్న రీతిలో ఉంది పంచాయతీరాజ్‌శాఖలో ఉన్నతాధికారుల తీరు. ప్రజల సొమ్మును దిగమింగిన అవినీతి అధికారులు దర్జాగా తిరుగుతుండగా, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం మాకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తు న్నారు. జిల్లాలోని గ్రేడ్-1, గ్రేడ్-2 పంచాయతీల్లో గతంలో భారీగా నిధులు దుర్వినియోగమయ్యాయి. పంచాయతీ కార్యదర్శులే ఈ సొమ్మును వారి ఖాతాలకు మళ్లించుకున్నారు. కొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులు విధులను దుర్వినియోగం చేశారు. ఇవన్నీ జిల్లాస్థాయి విచారణలో బట్టబయలయ్యాయి. అయినా అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవడం లేదు. గ్రేడ్-1, గ్రేడ్-2 పంచాయతీలకు సంబంధించిన అవినీతి వ్యవహారాల నివేదికలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు రాష్ట్ర కమిషనరేట్‌కు పంపుతున్నారు. అయితే అక్కడి నుంచి తదుపరి ఎలాంటి ఉత్తర్వులు వెలువడడం లేదు. గ్రేడ్-1, గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకునే అధికారం పంచాయతీరాజ్ కమిషనర్‌కు మాత్రమే ఉంది. అంతకు తక్కువగా ఉన్న పంచాయతీల్లో జరిగిన అవినీతి వ్యవహారాలపై చర్యలు తీసుకునే అధికారం కలెక్టర్‌కు ఉంది. అయితే కలెక్టర్ వద్దకు వెళ్లే నివేదికలపై వెంటనే చర్యలు తీసుకుంటుండగా, కమిషనరేట్‌కు వెళ్లే నివేదికలు మాత్రం బయటకురావడంలేదు.

12 మందిపై చర్యలకు సిఫార్సు

గత ఆరునెలల కాలంలో సుమారు 12 మంది పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్‌డీలపై చర్యలు తీసుకోవాలని జిల్లా నుంచి విచారణ నివేదికలతో అధికారులు సిఫార్సు చేశారు. కానీ ఇప్పటివరకూ వారిపై చర్యలు తీసుకోలేదు. కలెక్టర్ వద్దకు ఫైల్‌వెళితే వారంలో తిరిగి వస్తుండగా, కమిషనరేట్‌కు ఫైల్ వెళితే మాత్రం నెలలు తరబడినా బయటకు రావడం లేదు. అవినీతి అధికారులు రాష్ట్రస్థాయిలో మేనేజ్ చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉదాహరణకు చూస్తే.. రూ.లక్ష నిధులు దుర్వినియోగం చేశారని మూడు రోజుల క్రితం ఓ పంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. అయితే రూ.1.25 కోట్లు నిధులు దుర్వినియోగం చేశారని ఓ పంచాయతీ కార్యదర్శిపై కమిషనరేట్‌కు నివేదిక వెళ్లి రెండు నెలలు దాటినా ఇంత వరకూ చర్యలు తీసుకోలేదు. ఈ పరిస్థితి ఇప్పుడు పంచాయతీ వ్యవస్థలో చర్చనీయాంశంగా మారింది.

కమిషనరేట్‌కు అవినీతి వ్యవహారాలు

- కోవూరు పంచాయతీలో ఓ గ్రామ కార్యదర్శి రూ.2.47 కోట్ల సొమ్మును తన ఖాతాలో వేసుకున్నారు. ఇందులో రూ.1.25 కోట్లు దుర్వినియోగం చేసినట్లు తేలింది. ఇలాగే మరో అక్రమ వ్యవహారానికి కూడా పాల్పడ్డారు. అనధికార లేఅవుట్లో నిబంధనలకు విరుద్ధంగా ఏడు బిల్డింగ్‌లకు ప్లాన్‌లు మంజూరు చేసి అవినీతికి పాల్పడారు. ఈ రెండు వ్యవహారాలపై వేర్వేరుగా నివేదికలు కమిషనరేట్‌కు వెళ్లాయి.
- కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీలో ఓ కార్యదర్శి ఏకంగా రూ.1.20 కోట్ల పంచాయతీ నిధులను తన సొంత ఖాతాకు మళ్లించుకున్నారు. అందులో రూ.25 లక్షల వరకూ దుర్వినియోగం చేశారు. ఈ మేరకు విచారణలో నిర్ధారణ జరిగింది.
- తిరుపతి జిల్లా చిల్లకూరు గ్రామ పంచాయతీ పేరు మీద రిజిస్ట్రేషన్ జరగాల్సిన ఓ లేఅవుట్‌లోని పది శాతం ఓపెన్ స్పేస్ భూమిని ఓ పంచాయతీ కార్యదర్శి తన పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతం ఈ కార్యదర్శి జిల్లాలో ఓ మండలానికి ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్నారు.
- పొదలకూరు పంచాయతీలో గతంలో పనిచేసిన ఓ కార్యదర్శి అనధికార లేఅవుట్లలో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేశారు. అలానే ప్రభుత్వ భూములకు ఎన్‌వోసీలు కూడా జారీ చేసి భారీ దుర్వినియోగానికి పాల్పడ్డారు.
- బుచ్చి మండలం ఇస్కపాలెం పంచాయతీలో గతంలో పనిచేసిన ఓ పంచాయతీ కార్యదర్శి అక్కడి రికార్డులను మాయం చేశారు. ఈ రికార్డులను మున్సిపాలిటీకు అప్పగించలేదు. దీని వెనుక పెద్ద మతలబే ఉన్నట్లు అధికారుల విచారణలో తేలింది.
- మనుబోలు మండలం జట్లకొండూరులో పనిచేసిన మరో కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశారు. అలానే ఈ భవనాల నుంచి తక్కువ పన్నులు వసూలు చేసినట్లు అధికారుల విచారణలో బయటపడింది.
- విడవలూరు మండలం ముదివర్తి పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేసినందుకు ముగ్గురు కార్యదర్శులు, చిల్లకూరు మండలం మోమిడి గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేసినందుకు మరో కార్యదర్శిని బాధ్యులుగా గుర్తిస్తూ జిల్లా అధికారులు వీరిపై చర్యలకు సిఫార్సు చేశారు.
- ఏఎస్‌పేట పంచాయతీలో ఆక్రమణలు తొలగించ కుండానే తొలగించినట్లుగా తప్పుడు నివేదికను లోకాయుక్తకు అందజేశారు. ఈ వ్యవహారంలో భారీ అవకతవకలు జరిగినట్లు విచారణలో తేటతెల్లమైంది. ఈ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలంటూ కమిషనరేట్‌కు నివేదిక పంపారు. అయితే వీటన్నంటిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



కోవూరు చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు (ఇన్‌సర్ట్‌లో) మాట్లాడుతున్న పాస్టర్ దివ్య

వైభవంగా ఈస్టర్ వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చర్చిల్లో ఆదివారం క్రీస్తు పునరుత్థాన వేడుకలను క్రైస్తవులు వైభవంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే(శుక్రవారం) నాడు క్రీస్తుకు శిలువ వేశాక, ఆయన తన విశ్వాసులతో 'బాధపడకుడి.. నేను మూడోరోజున లేచి వస్తాను. ఎల్లప్పుడూ మీవెంటే ఉండి, సహాయం చేస్తా' అని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మూడోరోజు ఆదివారం తెల్లవారుజామున సమాధి బండను తొలగించుకుని తెల్లనివస్త్రాలతో క్రీస్తు దర్శనం ఇచ్చి అంతర్ధానం అయిన సందర్భంగా ఆదివారం ఈస్టర్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి క్రీస్తు పునరుత్థానం సమయం వరకు అన్నీ చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. క్రీస్తు పునరుత్థానాన్ని దృశ్యరూపకంలో ప్రదర్శించేందుకు చర్చిల్లో భారీ సెట్టింగులు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి స్నేహితులు, బంధువులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేసి, స్వీట్లు పంచుకున్నారు.

బిషప్ హౌస్‌లో అగ్నిప్రమాదం

నగరంలోని బిషప్ హౌస్‌లో క్రీస్తు పునరుత్థానం సందర్భంగా భారీగా ప్రత్యేక సెట్టింగ్‌లు విద్యుత్, పుష్పాలంకరణలు చేశారు. బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు, బైబిల్ వాక్యాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. క్రీస్తు పునరుత్థాన సమయంలో వెలుగులు చిమ్మేందుకు చిచ్చుబుడ్లను ఏర్పాటు చేశారు. ఉవ్వెత్తున లేచిన చిచ్చుబుడ్డి నిప్పురవ్వలు టార్పాలిన్‌పై పడడంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు లేచాయి. దీంతో భక్తులంతా భయాందోళనలకు గురయ్యారు. సమయస్ఫూర్తితో మంటలను ఆర్పి వేయడంతో ప్రమాదం తప్పింది. బిషప్ హౌస్ వందేళ్ల చరిత్రలో ఇలాంటి దురదృష్టకర సంఘటన చోటు చేసుకోలేదు.

వేసవిలోనూ పెరగని నిమ్మ ధర

- లూజు బస్తా రూ. 6 వేల నుంచి రూ.7,800 వరకు

పొదలకూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలోనూ నిమ్మకాయల ధరలు ఆశించిన స్థాయిలో పెరగలేదు. ప్రస్తుత మున్న ధరలు గిట్టు బాటయ్యేలా ఉన్నా, వేసవిలో ఇంకా పెరిగితే రైతులు ఆర్థికంగా నిల దొక్కుకునే అవకాశం ఉంది. అయితే ఈనెల రెండో వారంలోనే ఉన్న ధరలు ప్రస్తుతం లేవు. తాజాగా లూజు (బస్తా) రూ.6వేల నుంచి రూ.7,800 వరకు ఉంది. కిలోల లెక్కన చూస్తే రూ.70 నుంచి రూ.90 వరకు ఉన్నట్లు వ్యాపారులు పేర్కొన్నారు. సాధారణంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో



లూజు (బస్తా) అత్యధికంగా రూ.10వేల వరకు పలుకుతోంది. ఈ ఏడాది నిమ్మకాయలకు ఆశించిన స్థాయిలో డిమాండ్ లేదంటున్నారు. ఢిల్లీ మార్కెట్‌కు గుజరాత్, కర్ణాటక, మధ్య ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుంచి నిమ్మ కాయలు ఎగుమతి అవుతున్నాయి. ఫలితంగా కాయలు ఎక్కువై ధరలు తగ్గుతున్నట్లు వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.



ఆత్మకూరులో ఆదివారం వేద పండితులకు సంభావన చెక్కు అందచేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు

- సీఎం జన్మదిన వేడుకల్లో మంత్రి ఆనం

ఆత్మకూరు,ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అపారమైన అనుభవం, సమర్థవంతమైన పాలనతో రాష్ట్రానికి మంచి భవిష్యత్‌ను అందించే ఏకైక నేత సీఎం చంద్రబాబునాయుడేనని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆత్మకూరులో సీఎం నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేలాదిమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణకు తరలిరాగా, ఆగమశాస్త్ర పండితులు, దేవదాయశాఖ అధికారులు సమక్షంలో సీఎం చంద్రబాబుకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షును ఇవ్వాలని కోరుతూ మహాహోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ప్రపంచంలోని తెలుగువారందరికీ, సుదీర్ఘకాలం రాష్ట్రానికి చంద్రబాబు సేవలు అందించాలని కోరుతూ హోమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన సుమారు 8000 మందికి వస్త్రాలు పంపిణీ చేశామని, ప్రతి ఒక్కరికి తిరుమల లడ్డూను అందచేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు దేవదాయశాఖకు సంబంధించిన 95 శాతం హామీలు అమలు చేశామన్నారు.వేదం అధ్యయనం చేసి, ఖాళీగా ఉన్న వారికి నెలకు రూ. 3000 చొప్పున సంభావన అందించేందుకు సీఎం చంద్రబాబు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆయన జన్మదినం సందర్భంగా ఇక్కడ ప్రారంభిస్తున్నట్లు ఆనం తెలిపారు. అనంతరం దేవదాయ శాఖ జోనల్ అధికారి, శ్రీకాళహస్తి ఈవో బాపిరెడ్డితోకలిసి వేద పండితులకు సంభావన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తాళ్లూరు గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సివిల్ సప్లయిస్ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ప్రకటన... నిరుద్యోగుల్లో ఆనందం

- తీరనున్న అభ్యర్థుల నిరీక్షణ
- జిల్లాలో భర్తీ కానున్న 673 టీచర్ పోస్టులు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ప్రకటన విడుదల చేసింది. దీంతో తమ కలలు సాకారం అవుతుండడంతో నిరుద్యోగుల్లో ఆనందం నెలకొంది. మెగా డీఎస్సీ పేరుతో వైకాపా ప్రభుత్వం దగా చేసింది. అయితే ఎన్నికల ముందు మాటిచ్చిన చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టగానే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారు.

20వేల మంది నిరీక్షణ

రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించిన ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహణకు ఆమోదం తెలిపింది. ఉద్యోగ ఖాళీలు అధికంగా ఉన్నా, గత జగన్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలను నీరుగార్చేలా నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో విద్యార్థి సంఘాలు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం నిరుద్యోగులకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ డీఎస్సీలో కొత్తగా బీఈడీ, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికీ అవకాశం కల్పించనున్నారు. జిల్లాలో గత ఐదేళ్లలో డీఎడ్ పూర్తి చేసిన వారు 10వేల మంది, బీఈడీ పూర్తి చేసిన మరో 10వేలమంది కలిపి 20వేల మంది వరకు నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో అత్యధికశాతం గ్రామీణ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువతే ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్న ఆలోచనలతో రూ.లక్షలు వెచ్చించి కోర్సులను పూర్తి చేశారు.

జిల్లాలో ఖాళీల వివరాలు

జిల్లావ్యాప్తంగా జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో 673 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో లాంగ్వేజ్-1 39, హిందీ 18, ఇంగ్లిష్ 84, మ్యాథ్స్ 63, ఫిజికల్ సైన్స్ 76, బయాలజీ 63, సోషల్ 103, ఫిజికల్‌ఎడ్యుకేషన్ 107, ఎస్‌జీటీ 115 కలిపి మొత్తం 668 పోస్టులు, ట్రైబుల్ వెల్ఫేర్ విభాగంలో హిందీ 1, ఇంగ్లిష్ 1, మ్యాథ్స్ 1, ఎస్‌జీటీ 2 కలిపి 5 పోస్టులు, రెండు విభాగాల్లో 673 పోస్టులు ఉన్నట్లు గుర్తించారు. అభ్యర్థులు మే 15వతేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.



మే20న మాక్ టెస్ట్, మే30న హాల్‌టికెట్లు విడుదల చేయనున్నారు. జూన్ 6, 7తేదీల్లో పరీక్షలు నిర్వహించి రెండురోజుల్లోనే ప్రాథమిక కీ విడుదల చేస్తారు. కీ విడుదలైన తరువాత వారంపాటు అభ్యంతరాలను స్వీకరించి, అనంతరం తుది కీ విడుదల చేస్తారు. అనంతరం వారంలోపు మెరిట్ జాబితాను ప్రకటిస్తారు. పూర్తి వివరాలు cse.ap.gov.in/apdsc.apcfss.in అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

రేషన్ పంపిణీ అస్తవ్యస్తం

- కార్డుదారులకు ఇచ్చే బియ్యంలో కోత
- డీలర్లు మారడంతోనే సమస్య
- కొత్తవారికి అందచేయని నిల్వ వివరాలు
- ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్ర

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. గత మూడునెలల నుంచి చౌకదుకాణాలకు బియ్యం కేటాయింపుల్లో భారీగా కోతపడుతోంది. ఫలితంగా కొంతమంది కార్డుదారులకు బియ్యాన్ని ఇవ్వలేక పోతున్నారు. గత ప్రభుత్వ పాలనలో నాయకులతో చేతులు కలిపిన కొందరు డీలర్లు, ఎండీయూ వాహనాల నిర్వాహకులు బియ్యాన్ని పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. కార్డుదారులు ఏప్రాంతంలోనైనా సరుకులు తీసుకునేలా పోర్టబిలిటీ విధానం అమల్లో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా కొంతమంది డీలర్ల నియామకం జరిగింది. వైసీపీ పాలనలో పనిచేసిన డీలర్ల వద్ద టన్నుల బియ్యం నిల్వ ఉండగా, కొత్త వారికి ఇవ్వకుండా ఈ-పాస్ యంత్రాన్ని మాత్రమే అప్పగించారు. కొత్తగా వచ్చిన డీలర్లకు నిల్వ బియ్యం కింద లెక్క చూపిస్తూ కేటాయింపుల్లో అధికారులు కోత విధించారు. దీంతో కొంతమంది కార్డుదారులకు బియ్యం ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. కొత్త డీలర్‌కు, పాత డీలర్ వద్ద నిల్వ ఉన్న బియ్యం సమాచారం తెలియదు. అధికారులూ చెప్పటం లేదు.



ఎండీయూ వాహనం ద్వారా జరుగుతున్న బియ్యం పంపిణీ

ప్రభుత్వంపై కక్షతోనే....

ఎండీయూ ఆపరేటర్లు కూటమి ప్రభుత్వంపై కక్షతో బియ్యం పంపిణీలో కోత పెట్టడంతో చివరన వచ్చిన లబ్ధిదారులకు ఇవ్వలేక పోతున్నామనే ప్రచారం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసే కుట్ర చేస్తున్నట్లు సమాచారం. పౌరసరఫరాలశాఖలో కొందరు అధికారుల సహాయ నిరాకరణ కారణంగా డీలర్లు సమస్యను ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పులకు ప్రస్తుతం తమను బలిచేస్తున్నారని డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బియ్యం కేటాయింపుల్లో కోత పడుతుంద డటంతో డీలర్లు వారికి కేటాయించిన మేరకే బియ్యం పంపిణీ చేస్తున్నారు. దీంతో పేదలకు బియ్యం అందటం లేదు. వారు బియ్యం కోసం రేషన్ షాపులకు వెళ్లటం, డీలర్లు బియ్యం లేవని చెప్పడం జరుగుతోంది. గత మూడు నెలల నుంచి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. పేదలు బహిరంగ మార్కెట్లో అధికధరలకు బియ్యం కొనలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

బియ్యం కేటాయింపుల్లో కోత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతాం. వచ్చే నెల కోటా నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయిస్తాం.



- విజయకుమార్, డీఎస్వో

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	100
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	204

కోడిగుడ్ల ధర (100) : 420

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9213
వెండి కిలో ధర	రూ. 98.400
వెండి ఒక గ్రాము	రూ.101.40

రామాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ

ఉలవపాడు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బద్దిపూడిలోని రామాలయంలో ఆదివారం జరిగిన సీతారాముల కల్యాణంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా కరేడు పంచాయతీ దర్మారెడ్డి సంఘం ఎస్టీకాలనీలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

న్యూస్ బాక్స్

బలవంతపు భూసేకరణ ఆపాలి

ఉలవపాడు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ప్రభుత్వం కారుచౌకగా ఎస్సీ, ఎస్టీల భూములు అప్పగించాలనే ప్రయత్నం ఆపాలని కరేడు పంచాయతీ పరిధిలోని ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం సీఐటీయూ నాయకులతో కలసి రామకృష్ణాపురం, పొట్టేనుగుంట, ఉప్పరపాలెంకు చెందిన ఎస్సీ, ఎస్టీలు నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు జీవీబీ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న భూసేకరణ పట్ల కరేడు ప్రజల భయాందోళనలు తొలగించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘం నాయకురాలు పొన్నం రామలక్ష్మమ్మ, సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, రామకోటయ్య, ఎస్.గిరి, వీసం విజయ్, నాగార్జున, సుజాత, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

జేవీవీకి యువరక్తం అవసరం

కావలిటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదికకు యువ రక్తం అవసరమని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జేవీవీ కార్యాలయంలో జరిగిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని భవిష్యత్ ప్రణాళికను వివరించారు. కావలి శాఖ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేపట్టిన పలు చైతన్య సేవా కార్యక్రమాల గురించి వివరించారు. సమావేశంలో జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, ప్రధాన కార్యదర్శి హరనాథ్, కోశాధికారి సుబ్బరామశర్మ, జిల్లా ఉపాధ్యక్షులు జానకిరామ్, కల్యాణి, మాధవ పాల్గొన్నారు.

టీడీపీ నేత సోదరుడి మృతికి పలువురి సంతాపం

లింగసముద్రం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగిరేకులపాడు మాజీ సర్పంచు, టీడీపీ నేత ముప్పరాజు వెంకటేశ్వర్లు సోదరుడు నాగేశ్వరరావు(65) శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, మండల ఇన్‌చార్జ్ గుళ్లా సుధాకర్, విశ్వనాథపురం గ్రామ సర్పంచు బొల్లినేని నాగేశ్వరరావు ఆదివారం ఉదయం అంగిరేకులపాడులో నాగేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పించారు.

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

కొండాపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని పలు గ్రామాల చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఆత్మీయులకు విందు ఏర్పాటు చేశారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

సంగం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు సీతారాములకు ప్రత్యేక పూజలు

ఉదయగిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సుద్ధబావి వీధిలో ఉన్న కోదండ రామస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం సీతారామచంద్రస్వామి వార్లకు పూలంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా స్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహించి 16 రోజులైన సందర్భంగా ఈ వేడుక నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు సీతమ్మతల్లి సారెగా పసుపు, కుంకుమ, తాంబూలం పంచడం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు వీకేపాడు మండల సమావేశం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడంతోపాటు భవిష్యత్తు కార్యాచరణపై చర్చించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి ప్రదాత చంద్రబాబు : ఇంటూరి



కందుకూరులో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు



దగదర్తిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాలేపాటి సోదరులు

కందుకూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి ప్రదాత అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే గ్రామదేవత అంకమ్మ ఆలయంలో చంద్రబాబునాయుడు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి 108 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం పార్టీ కార్యాలయంలో 75 కిలోల భారీ కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో పేదలకు ఉచితంగా భోజన ఏర్పాట్లు చేసి వారితో కలసి ఎమ్మెల్యే అక్కడే భోజనం చేశారు. ఏరియా ఆసుపత్రి, కోవూరురోడ్డులోని స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాలల్లో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, వేముల గోపాలరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, కంద్రా మాల్యాద్రి, చిలకపాటి మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని పామూరురోడ్డు సర్కిల్‌లో టీడీపీ నాయకుడు మాదాల రవీంద్ర ఆధ్వర్యంలో, గుర్రంవారిపాలెం, డీవీ నగర్ ప్రాంతంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేకు కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు.

● మండలంలోని పందలపాడు జాషువా కాలనీలోని చర్చిలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఆధ్వర్యంలో కేకు కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంజుల రామచంద్రారెడ్డి, కంజుల రంగారెడ్డి, పుట్టా వెంకటరామిరెడ్డి, వర్ల రమేష్, గోచిపాతల లింగయ్య, కన్నెదారి బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.



అల్లూరులో కేక్ కట్ చేసి నాయకులకు తినిపిస్తున్న బీద గిరిధర్

కావలి : చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు కావలిలో ఘనంగా నిర్వహించారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి టీడీపీ శ్రేణులకు పంచిపెట్టారు. అనంతరం కావలి ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ట్రంకురోడ్డులోని అన్నా క్యాంటీన్‌లో పేదలకు అన్నదాన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, అన్నదాత మణి, పోట్లూరు శ్రీనివాసులు, బొట్లగుంట శ్రీహరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

అల్లూరు : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు అల్లూరు పాతబస్టాండు కూడలిలోని వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సోమశిల కమిటీ ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ భారీ కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గుంజి రుద్రయ్య, ప్రభాకర్, తోట శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో తెలుగు యువత మండల అధ్యక్షుడు చెన్నారెడ్డి మహేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా వెంకటేశ్వర్లు, కోకా చిరంజీవి, మద్దసాని కృష్ణ, అమరా మాల్యాద్రి, మన్నం సుబ్బారావు, బీజేపీ నాయకుడు సుధాకర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : కొండాపురం, గరిమెనపెంట, భీమవరప్పాడు, ఆదిమూర్తిపురం గ్రామాల్లో కేకు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ వైస్‌ఎంపీపీ పోలినేని చంద్రబాబు నాయుడు, నాయకులు పీ.రమేష్, దాసరి అశోక్, నర్రా శివన్నారాయణ, యారవ క్రిష్ణయ్య, జాగర్లమూడి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ చాగంటి క్రిష్ణ పాల్గొన్నారు. చంద్రబాబునాయుడు ఆయురారాగ్యోలతో ఉండాలని స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

బిట్రగుంట : బోగోలు టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పేదలకు భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రాఘురామ్‌నాయుడు, బీజేపీ నేతలు ఎస్ఎస్‌యాదవ్, వీ.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. అలాగే బోగోలు ఇంచార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు, నేతలు జీ.నాగరాజు, శీనయ్య, ఎం.వేంకటేశ్వర్లు, ప్రభాకర్, అరుణమ్మలు కేక్ కట్ చేశారు.

● మహిళలకు చీరల పంపిణీ

దగదర్తి మండలం వెలుపోడు సెంటర్‌ల్లో రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, యువనాయకుడు మాలేపాటి భానుచందర్ నాయుడు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం మండలంలోని దాదాపు రెండు వేల మంది మహిళలకు చీరలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాలేపాటి సుధాకర్ నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు : మండలంలోని కరేడు పంచాయతీ ధర్మారెడ్డి సంఘంలో ఎస్టీ మహిళలతో కలిసి కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ఎస్టీ మహిళలు కేక్ తినిపించారు. ఉలవపాడులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగు తమ్ముళ్లు కేక్ కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

లింగసముద్రం : లింగసముద్రం కోటయ్య మందిరం వద్ద టీడీపీ గ్రామ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడపా రంగయ్య, పూరిమిట్ల బాలకోటయ్య, యు నాగేశ్వరరావు, అడపా నర్సయ్య, మక్కెన మల్లికార్జున, సీహెచ్ బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే చినపవనిలో నాయకులు సోంపల్లి మనోహర్, మోతుకూరి పర్వతాలు, ఏలూరి వెంకటేశ్వర్లు, తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు.



కావలిలో సీఎం జన్మదిన కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

వాడవాడలా ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు



సంగం: సంగమేశ్వరుడికి అభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు



మర్రిపాడు: సర్వమత ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

సంగం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలను ఆదివారం సంగంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సంగమేశ్వరాలయంలోని పాతాళ శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగం బస్టాండ్‌లో బాణాసంచ కాల్చి భారీ కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఎస్సీ హాస్టల్ బాలికలకు, వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వెంగారెడ్డిపాలెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: అమరావతి రూపకర్త, అభివృద్ధి ప్రధాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో చంద్రబాబు జన్మదినం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్‌లతో కలిసి 75 కేజీల కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న తదితరులు పాల్గొన్నారు. కాగా, సీఎం చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో ఉండి రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయగిరి పట్టణంలోని ఆయన నివాస ఆవరణలో చంద్రబాబు జన్మదినం సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శాంతికుమారి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహా, గయాజ్, సజిల్, నవాజ్, ఉప్పుటూరి వెంకటయ్య, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో చంద్రబాబునాయుడి జన్మదినం సందర్భంగా మండల టీడీపీ కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

●కలువాయి : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలను ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ జీ వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, జగదల్ నాయుడు, చల్లా శివారెడ్డి, జీ చంద్రమౌళి, చల్లా విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రయ్య నాయుడు, నాలి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

●అనంతసాగరం: చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు ఆదివారం స్థానిక వ్యవసాయ సొసైటీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భారీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉత్తర కాలువ చైర్మన్ మెట్టుకూరు కృష్ణారెడ్డి, మండల అధ్యకురాలు సునీత, సాగరం చెరువు నీటిసంఘం అధ్యక్షుడు రాఘూరు సుబ్బారెడ్డి, ఖాసీంబాష, మెట్టుకూరు సుబ్బారెడ్డి, తెలుగు యువత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●మర్రిపాడు: చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆరి కట్ల జనార్ధన్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్వమత ప్రార్థనలు చేసి, కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ శాఖమూరి నారాయణ, చిన్నారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎలగాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

●వింజమూరు: పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, నాయకులు కొండపల్లి వెంకటేశ్వర్లు, మంచాల శ్రీనివాసులునాయుడు, వేమలపాటి మాల్యాద్రి, చావా మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు. అలాగే బొమ్మచెరువు క్యాంప్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

●సీతారామపురం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మాజీ మండల కన్వీనర్ ముత్తంశెట్టి చెన్నకేశవులు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, షేక్ బాబు, భోగినేని కాశీరత్తయ్య, దేవర వేంకటేశ్వర్లు, చంద్ర, నాగేశ్వరరావు, జాషువా, ఇజ్రాయిల్, తురక వెంకటేశ్వర్లు, చంద్రారెడ్డి, వికాష్‌బాబు, గౌస్, మండల టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ఉదయగిరి: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకురాలు కాంతికుమారి, తదితరులు



వరికుంటపాడులో కేకు కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

పండుగలా అభివృద్ధి పనుల ప్రారంభం

జలదంకి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రారంభోత్సవాల కార్యక్రమం పండుగలా జరిగింది. మండలానికి చేరుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ టీడీపీ శ్రేణులతో కలసి గ్రామాల్లో పర్యటించారు. జమ్మలపాలెంలో రూ.10.50 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, జలదంకిలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రూ.10లక్షలతో నిర్మించిన ఎంపీపీ భవనం, జలదంకిలో రూ.60 లక్షలతో, గమళ్లపాలెంలో రూ.50లక్షలతో, బ్రాహ్మణక్రాక పంచాయతీ హనుమకొండపాలెంలో రూ.45లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే జలదంకి, కమ్మపాలెం, చినక్రాకలో గోకులం షెడ్లను ప్రారంభించి గోమాతలకు మేత పెట్టారు.

చంద్రబాబు జన్మదిన సంబరాలు

జలదంకి బస్టాండు కూడలిలో జరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భారీ కేక్‌ను కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచల బాబుయాదవ్, ఎంఈపీ గోచిపాతల వెంకటరమణయ్య, నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, పీ.మధుమోహన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, మధు సూదనరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాకర్లకు కేకు తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంభం

సీసీ రోడ్లకు శంకుస్థాపన

కలిగిరి : మండలంలోని కలిగిరి- సంగం రహదారిలో వెలగపాడు పంచాయతీ పరిధిలో కొత్తూరు నుంచి పెద్దపాడు వరకు, కమ్మవారిపాలెంలో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, తాతయ్య, నరసింహులునాయుడు, జీ.శ్రీనివాసులు, ప్రసాదు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను తిరస్కరించండి

కందుకూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగానికి, సుప్రీం కోర్టు సూచనలకు విరుద్ధంగా ఉన్న ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను తిరస్కరిస్తూ న్యాయపోరాటాలకు మాలలు సిద్ధం కావాలని మాలమహానాడు, మాల ఉద్యోగుల సంఘం, మాలసంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో వద్ద ఆర్డినెన్స్ ప్రతులను చించివేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలేటి కోటేశ్వరరావు, లింగాబత్తిన బ్రహ్మయ్య, కట్టా రమేష్, చనమాల కోటేశ్వరరావు, చార్వాక, జనార్దన్, బొట్లగుంట శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబరాలు

కలిగిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తేవడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం కలిగిరిలో సంబరాలు జరుపుకున్నారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ప్రమాద సమాచారం సకాలంలో అందించాలి

కావలి రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందిస్తే ప్రమాద తీవ్రత తగ్గించవచ్చని ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి జి.ప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం జరిగిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే 101, 112, 08626-243101, 9963734286కు సమాచారం ఇవ్వాలన్నారు. అగ్నిప్రమాదాల నిర్మూలనకు ఉపయోగించే పరికరాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

సంగం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు, జంగాలకండ్రిక, వంగల్లు, ఎస్‌వీఆర్ పురం తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షుడు సురమౌళి, సభ్యులు కోటేశ్వరరావు, శ్రీదేవి, రాజేంద్రప్రసాద్, నారాయణమ్మ, సుమలత, రఘురామయ్య సుమలత తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళలపై విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఉదయగిరి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): చిత్రకళలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు సంస్కార భారతి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వై సుదర్శన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మే మాసంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రతి గురు, శుక్రవారాల్లో ఈ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు 8639740303 అనే నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సంగం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాదాల మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైనవారిని వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని సీనియర్ టీడీపీ నాయకుడు కర్నాటి రవీంద్రరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీఎంపీ అసోసియేషన్ సభ్యులు జగన్, మహేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేశన శంకరరావు

ఓబీసీ కులాల జనాభాను ప్రత్యేకంగా లెక్కించాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జనగణనతో పాటు ఓబీసీ కులాల జనాభాను ప్రత్యేకంగా లెక్కించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆదివారం నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ అభివృద్ధి ఓబీసీల అభివృద్ధితో ముడిపడి ఉందన్నారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో సీట్ల కేటాయింపు సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కాంట్రాక్టు పనులలో బీసీలకు అవకాశం కల్పించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, రాష్ట్ర కార్యదర్శి ముంగర శైలజ, విశ్రాంత బీసీ సంక్షేమాధికారి వై వెంకటయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు పీ కిరణ్‌కుమార్, అడ్వకేట్స్ అధ్యక్షుడు పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జీవోను స్వాగతిస్తున్నాం

● ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్



చర్చావేదికలో మాట్లాడుతున్న మంద బాబ్జీ

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ జీవోను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు మంద బాబ్జీ చెప్పారు. నెల్లూరులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం వర్గీకరణ జీవోపై చర్చావేదిక జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తర్వుల్లో పేర్కొన ప్రకారం ప్రతి ప్రభుత్వ శాఖలో నూతన రోస్టర్ విధానం ప్రకారం కొత్త రిజిస్టర్లు తయారు చేసి వాటి ద్వారా మాత్రమే ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

పశ్చిమ బంగలో రాష్ట్రపతి పాలన విధించాలి

● ఛత్రపతి శివాజీ సేన డిమాండ్



పశ్చిమ బంగలో మరణించిన హిందువుల ఆత్మశాంతి కోసం కొవ్వొత్తులు ప్రదర్శిస్తున్న శివాజీసేన నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : హిందువుల భద్రత కోసం పశ్చిమబంగ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని ఛత్రపతి శివాజీ సేన డిమాండ్ చేసింది. పశ్చిమ బంగ రాష్ట్రంలో జరిగిన మతోన్మాదుల దాడిలో ముగ్గురు హిందువులు మరణించడాన్ని నిరసిస్తూ నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలిలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. శివాజీ సేవ అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి మాట్లాడుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే హిందువులు అశువులు బాసారని ఆరోపించారు. వక్ఫ్ చట్టంపై నిరసనలకు హిందువుల ఇళ్లపై దాడులకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. పశ్చిమ బంగ మత చాందసవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మశాంతి కోసం కొవ్వొత్తులు వెలిగించి నివాళు లర్పించారు. అనంతరం ట్రంకురోడ్డులో ర్యాలీ నిర్వహించి, శివాజీ సెంటర్‌లోని శివాజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో శివాజీ సేన గౌరవాధ్యక్షుడు బత్తిన సాయికుమార్‌రెడ్డి, కార్యదర్శి మధురెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్ చౌదరి, హిందూ చైతన్య వేదిక నాయకుడు నాగశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కష్టతరంగా జీవజాలం మనుగడ

జిల్లాలో పారిశ్రామిక ప్రగతితో తప్పని ముప్పు

ప్రమాదంలో పుడమితల్లి

● వివిధ రసాయనాలతో పరిస్థితి విషమం

● ప్రత్యామ్నాయ చర్యలు లేకుంటే భవిష్యత్తులో ఇబ్బందులే !

● రేపు ధరిత్రీ దినోత్సవం

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పుడమితల్లి పరిస్థితి నేడు దయనీయంగా మారింది. ప్రకృతి ప్రకోపానికి జీవుల మనుగడే ఆందోళనకరంగా మారుతోంది. ఆధునిక భావజాలంతో మానవుడు సృష్టిస్తున్న విధానాలతో ధరిత్రీ కన్నీరు పెడుతోంది. తాగేనీరు, పీల్చేగాలి, నివసించే నేల... ఇలా ప్రకృతి వనరులన్నీ కాలుష్యం కాటుకు గురవుతున్నాయి. ఒకప్పుడు చెరువులు, అటవీ ప్రాంతాలు జీవవైవిధ్యంతో విరసిల్లగా, నేడు పట్టణీకీకరణ పేరుతో కాంక్రీట్ జంగిల్‌గా మారాయి. భూమి, నీరు, గాలి కాలుష్యానికి గురవుతూ ప్రాణాలనే హరించి వేస్తున్నాయి. పరిశ్రమల కాలుష్యం కారణంగా సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ లాంటి విష వాయువులు విడుదల జీవుల మనుగడకే ముప్పులా మారాయి. ఓజోన్‌పొర కూడా దెబ్బతినడంతో పరిస్థితి దారుణంగా మారింది. జీవరాశులకు నెలవైన భూమి ప్రమాదకరంగా మారుతుండడంతో



ప్రపంచంలోని 182 దేశాలు ప్రతి ఏటా ఏప్రిల్ 22న (మంగళవారం) ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మాణించాయి.

● పరిశ్రమలతో పరిస్థితి దారుణం

జిల్లాకు ఎన్నో పరిశ్రమలు వచ్చాయి. రాష్ట్రంలో విశాఖపట్నం తర్వాత ఆ స్థాయి పరిశ్రమలు నెల్లూరు జిల్లా తీరప్రాంతాల్లోనే నెలకొల్పారు. జిల్లాలో సముద్రతీరం పొడవునా థర్మల్ విద్యుత్ కేంద్రాలు నిర్మించారు. ఇప్పటికే అవి ఉత్పత్తిలో ఉన్నాయి. ఆ పరిశ్రమల 15 కిలోమీటర్ల పరిధిలో 2 నుంచి 5 డిగ్రీలు ఉష్ణోగ్రత పెరిగి, పంటల దిగుబడి 30 శాతం తగ్గుతుంది. ఆక్వా పరిశ్రమ ప్రశ్నార్థకంగా మారిది. థర్మల్ పరిశ్రమల ద్వారా రోజుకు 2 లక్షల టన్నుల బూడిద వెదజల్లబడి తాగు, సాగునీరు కలుషితమై మనుషులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతారు. థర్మల్ కేంద్రాల వేడి వల్ల సముద్రంలోని వేలాది టన్నుల రొయ్యలు, చేపలు చనిపోయి మత్స్యకారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఇక వాహన కాలుష్యం వల్ల కాలుష్యం వెదజల్లబడి జీవజాతుల మనుగడ కష్టతరంగా మారింది. గతంలో 43 డిగ్రీలకే అల్లాడిపోయిన జిల్లా ప్రజానీకం ఈ ఏడాది సుమారు 45 డిగ్రీల వరకు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే ఇక మే, జూన్ నెలల్లో ఎండవల్ల పరిస్థితి మరింత విషమంగా మారే అవకాశం ఉంది. దీనికితోడు ఫ్రిజ్‌లు, ఏసీల వాడకం పెరగడంతో వాటి వల్ల క్లోరోఫ్లోరో కార్బన్‌లు వెదజల్లుతున్నాయి. ఈ వాయువులు ఓజోన్ పొరను దెబ్బతీస్తున్నాయి.

ధరిత్రీని కాపాడుకోవాలంటే..

- ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలి. ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానాన్ని అవలంభించాలి.
- వేస్ట్ మేనేజ్‌మెంట్ గురించి అవగాహన కల్పించాలి.
- తరగిపోయే వనరులకు బదులు తరగని పునర్ వినయోగించుకొనే వనరుల ఆధారంగా సుస్థిరా భివృద్ధి సాధించాలి.
- గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను కనిష్ఠస్థాయికి తగ్గించాలి. చెత్తను దహనం చేయడం ఆపాలి.
- అడవుల రక్షణ, పునర్‌పెం పకం, సుస్థిర యాజమాన్యం పద్ధతులు, జీవవైవిధ్యాన్ని సంరక్షణ చేపట్టాలి.
- ప్రజా రవాణాను ప్రోత్సహించాలి. వ్యక్తిగత రవాణాను తగ్గించేలా వాహన వినియోగాన్ని తగ్గించుకోవాలి.
- భూగర్భ జలపునరుద్ధరణకు తగినన్ని చెరువులు, కుంటలు, జలాశయాలను రక్షించుకోవాలి.
- రసాయనేతర పద్ధతులతో వ్యవసాయం చేయాలి.
- సౌరశక్తి, పవనశక్తి వంటి ప్రత్యామ్నాయ వనరులను అందుబాటులోకి తీసుకురావాలి.
- నీటిని వ్యాపారవస్తు వుగా, ఆర్థిక వనరుగా మార్చే విధానాలను ప్రభుత్వాలు స్వస్తి పలకాలి.
- ధరిత్రీ పరిరక్షణకు జీవ వైవిధ్య సంరక్షణకు చేసిన చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయాలి.

ధరిత్రీకి మరింత ముప్పు



జిల్లాలో భూమితల్లికి మరింత ముప్పు ఏర్పడుతోంది. భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా చెట్లను పెంచాల్సిన అవసరం ఉంది. ఐక్యరాజ్యసమితి నిర్ణయం ప్రకారం 33 శాతం అడవులు ఉండాలి. అయితే ప్రస్తుతం అడవులు ఆక్రమణకు గురయి 19శాతం మాత్రమే మిగిలాయి. ఇది చాలా ప్రమాదకరం. మర అడవులు అంతరించి పోతున్నాయి. జిల్లా తీరప్రాంతాల్లో థర్మల్ పవర్‌స్టేషన్లతోపాటు వివిధ పరిశ్రమలు పెద్దసంఖ్యలో వస్తున్నాయి. ఇండస్ట్రియల్ కారిడార్‌గా మార్చాలన్న ప్రభుత్వ ఉద్దేశాన్ని స్వాగతిస్తున్నా, పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టకపోవడంతో పరిస్థితి విషమంగా మారుతోంది. వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకాన్ని విడనాడాలి.

- డాక్టర్ కాలేషా బాషా,
జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు

రాత్రుళ్లు పోలీసు తనిఖీల కొనసాగింపు



రాత్రి రోడ్లపై తిరుగుతున్న యువతను ప్రశ్నిస్తున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆకస్మిక తనిఖీలు శనివారం రాత్రి కొనసాగించారు. జిల్లాలోని లాడ్జీలు, వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేశారు. ఎస్పీ జీ కృష్ణకాంత్ తనిఖీల వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. జిల్లాలోని 96 లాడ్జీలలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారని, రాత్రి వేళల్లో లాడ్జీల్లో బస చేసిన వ్యక్తుల వివరాలు తెలుసుకుంటూ అనుమానితులను ప్రశ్నించినట్లు పేర్కొన్నారు. 3100 వాహనాలు తనిఖీ చేసి 30 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 70 మోటారు వాహనాల తనిఖీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి రూ.43,080 ఫైన్ విధించినట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పోలీసులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటు లో ఉంటూ విజిబుల్ పోలీసింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



విల్లు ఎక్కుపెట్టి క్రీడలను ప్రారంభిస్తున్న జేడీ రమేష్‌నాయక్

ఉత్సాహంగా పశువైద్యుల క్రీడోత్సవం

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా ఆదివారం నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పశువైద్యుల క్రీడోత్సవం జరిగింది. పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే రమేష్‌నాయక్ ఈక్రీడలను ప్రారంభించారు. వాలీబాల్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, టెన్నీకాయిట్, మ్యూజికల్ చైర్, షటిల్ వంటి పోటీల్లో పశువైద్యులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాలీ బాల్‌లో డాక్టర్ కృష్ణమౌర్య బృందం, డాక్టర్ సోమయ్య బృందాలు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. త్రోబాల్‌లో మహిళల్లో డాక్టర్ జే యశోద మొదటి స్థానం, భవానీ రెండో స్థానం సాధించారు. టెన్నీకాయిట్‌లో ఝాన్సీ, సుజని టీం గెలవగా, వాణీ శంకర్, భారతి రన్నరప్‌గా నిలిచారు. మ్యూజికల్ చైర్స్‌లో డాక్టర్ చైతన్య కిషోర్ కుమార్తె ప్రజ్ఞ, డాక్టర్ సుజని మొదటి రెండు స్థానాలు, టగ్ ఆఫ్ వార్‌లో డాక్టర్ టీ సోమయ్య బృందం, షటిల్‌లో కొమ్మి గంగాధర్ మొదటి స్థానంలో నిలిచారు.

జిల్లా క్రికెట్ సంఘం కార్యవర్గం ఎంపిక



జిల్లా క్రికెట్ సంఘం నూతన కార్యవర్గం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో సంఘం సమావేశం జరిగింది. 2025-28 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్ రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శిగా కే శ్రీనివాసులురెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎన్ మస్తానయ్య, ఉపాధ్యక్షుడిగా ఎం రామకృష్ణ, కోశాధికారిగా ఎం హజిత్ యాదవ్, కౌన్సిలర్‌గా సీ అనిల్ కుమార్, జనరల్ మేనేజర్‌గా పీ భానుప్రకాష్‌రెడ్డి, మరో 31 మంది మంది సభ్యులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీఏ కేర్‌టేకర్ డీ శ్రీనివాస రెడ్డి, ఏసీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : డీఎస్ఏ, ఎన్‌వైకే సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులో నిర్వహించిన ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. క్రీడాకారులు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి కరెంట్ ఆఫీస్ మీదుగా తిరిగి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రీడాకారుల్లో, ప్రజల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు డీఎస్‌డీవో యతిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే అధికారి మహేంద్రరెడ్డి, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న క్రీడాకారులు

ఉద్యోగాల్లో క్రీడా రిజర్వేషన్ పెంపు హర్షణీయం



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల్లో క్రీడాకారులకు స్పోర్ట్స్ రిజర్వేషన్ కోటా పెంపు హర్షణీయమని రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై సుమన్ అన్నారు. జిల్లా చెస్ సంఘం, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని సిల్వర్‌ఓక్స్‌లో ఆదివారం ప్రారంభమైన రాష్ట్ర చెస్ పోటీల్లో ఆయన మాట్లాడారు. ప్రతిభ కలిగిన క్రీడాకారుల ప్రయోజనాలకు క్రీడా రిజర్వేషన్‌ను 2 నుంచి 3శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు కూడా ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా క్రీడల్లో సత్తా చాటుతూ ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. కాగా, ఈ చెస్ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 250 మందికిపైగా క్రీడాకారులు హాజరై ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమంలో చెస్ అకాడమీ డైరెక్టర్ ఎం గోపీనాథ్, కోచ్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఆర్బిటర్స్ హుస్సేన్, ప్రదీప్, వెంకటరమణ, రామ్‌లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దామిశెట్టి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ మృతి

● కావలి రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర



దామిశెట్టి శ్రీనివాసులునాయుడు (ఫైల్)

కావలిటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : అందరిని ఆప్యాయంగా పలకరించే దామిశెట్టి గ్రూప్‌ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్, డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు(73) ఆదివారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. దామిశెట్టి కావలి రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసిన ఆయన వివాదరహితుడిగా పేరుతెచ్చుకున్నారు. కావలి పట్టణంతోపాటు మండల ప్రజలకు శీనన్నగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన సతీమణి శాంతమ్మ, సోదరుడు దామిశెట్టి పూర్ణయ్యలు కావలి ఎంపీపీగా పనిచేశారు. మరో సోదరుడు మల్లికార్జునరావు, కుమారుడు సుధీర్‌నాయుడులు కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్లుగా పనిచేశారు. దామిశెట్టి మృతికి పట్టణ, మండల, జిల్లా నుంచి పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.

● మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పరామర్శ

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైసీపీ మేధావుల విభాగం రాష్ట్ర నాయకుడు దామిశెట్టి సుధీర్‌నాయుడుకు ఫోన్ చేసి పరామర్శించి శీనన్న మృతికి సంతాపం తెలిపారు.

బొలెరో వాహనం ఢీకొని యువకుడి మృతి

కావలి రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): బొలెరో వాహనం ఢీకొని మోటారు సైకిల్‌పై వెళ్తున్న చేజర్ల మల్లికార్జున్(30) మృతి చెందాడు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి కావలి మండలం గౌరవరం సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. బోగోలు మండలం ముంగమూరుకు చెందిన మల్లికార్జున్ పెయింట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో కావలి నుంచి మోటారు సైకిల్‌పై ముంగమూరుకు వెళ్తూ మార్గ మధ్యంలోని గౌరవరం సర్వీస్ రోడ్డు నుంచి హైవేపైకి వచ్చే క్రమంలో అద్దంకి నుంచి బెంగళూరుకు వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లికార్జున్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, 2 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుమలరెడ్డి తెలిపారు.

సోమశిలలో51.798 టీఎంసీల నీరు

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 51.798 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 1,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నేరాల నియంత్రణకు డ్రోన్ నిఘా : ఎస్పీ



డ్రోన్ కెమెరాల ద్వారా సీన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర, శివారు ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు డ్రోన్ నిఘా ఉంటుందని ఎస్పీ జీ. కృష్ణకాంత్ తెలిపారు. నగర పరిధిలో ఆదివారం సీఐల సమక్షంలో డ్రోన్‌తో పలు ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేసిన నేపథ్యంలో 70 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామన్నారు. నిర్మానుష్య ప్రదేశాల్లో గ్యాంబ్లింగ్, మద్యం సేవించే వారిపై డ్రోన్ కెమెరాల నిఘా ఉంచామన్నారు. జిల్లాలో ఇకపై సాంకేతికతతో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, నేరాల నియంత్రించుటకు వినూత్నన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రోన్ తనిఖీలో నగర డీఎస్పీ పీ. సింధుప్రియ, సీఐలు పాల్గొన్నారు.

● మందుబాబులపై కేసుల నమోదు

నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలో తొలిసారిగా డ్రోన్ల ద్వారా బహిరంగంగా మందుతాగుతున్నవారిని గుర్తించి కేసులు నమోదు చేశామని సీఐ గుంజి వేణు తెలిపారు. ఆదివారం హైవే పక్కనున్న పద్మావతి గ్రీన్‌సిటీలో డ్రోన్లను ఉపయోగించి అనుమానస్పదంగా ఉన్న వ్యక్తులు, మందుబాబులను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. వారికి జరిమానాలు, కొందరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రూరల్‌లోని అనుమానాస్పద ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కొత్తకారుకు పూజ చేసి వస్తుండగా..

● వడ్లపూడి సమీపంలోని మలుపు వద్ద బోల్తా

మనుబోలు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లపూడి సమీపంలో ఆదివారం వేకువజామున కారుబోల్తా పడింది. పొదలకూరు మండలం బిరదవోలు పంచాయతీలోని రాజుపాళెంకు చెందిన అట్ల రమణారెడ్డి కుటుంబసభ్యులు మూడురోజుల కిందట కొత్తకారు కొనుగోలు చేశారు. శనివారం గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయంలో పూజలు చేయించి నిద్రచేశారు. ఆదివారం వేకువజామున స్వగ్రామానికి తిరిగి వస్తుండగా కసుమూరు-వడ్లపూడి రోడ్డులోని వంతెన వద్ద కారు మలుపు తిప్పే క్రమంలో కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో 5మంది ఉన్నారు. వీరికి ఎలాంటి ప్రాణహాని జరగక పోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. వంతెనకు రక్షణగోడ లేకపోవడంతోనే ఈ ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని ఈ ప్రాంతవాసులు తెలిపారు. క్రేన్‌సాయంతో కారును బయటకు తీశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

బిట్రగుంట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వ్యక్తి ఆదివారం మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. బోగోలు మండలం తాళ్లూరు దళితవాడకు చెందిన యేసుపోగు మొలకయ్య (47) తనకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేసుకొంటూ కుటుంబాన్ని పోషంచుకుం టున్నాడు. తన ఇద్దరు కుమార్తెలకు అప్పు చేసి వివాహాలు జరిపించాడు. అయితే పంటల దిగుబడి సరిగాలేక చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంలో శనివారం సాయం త్రం తన పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం కావలి, నెల్లూరుకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆదివారం చెన్నైకి తరలిస్తుం డగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుమార్తె మర్లపాటి స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ భోజ్యం, ఏఎస్ఐ కోటేశ్వరరావులు తెలిపారు.



కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి: ముగ్గురి అరెస్టు

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం తురుమెళ్ల అటవీ ప్రాంతంలో కోడి పందాల స్థావరంపై స్థానిక ఎస్ఐ జంపానికుమార్ తమ సిబ్బందితో కలసి ఆదివారం దాడులు నిర్వహించారు. కోడి పందాలు ఆడుతున్న ముగ్గురుని అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.1320 స్వాధీనం చేసుకున్నారు. వారిని సోమవారం కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరి దుర్మరణం



ప్రమాదంలో మృతిచెందిన నరసింహులు



ఘటనా స్థలంలో ఝాన్సీ మృతదేహం

మర్రిపాడు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన మర్రిపాడు మండలం కదిరి నాయుడుపల్లి అటవీ ప్రాంతంలో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కడప జిల్లా అట్లూరు మండలం మత్తుకూరు గ్రామానికి చెందిన నరసింహులు (26), బద్వేల్ మున్సిపాలిటీ రూపవరం పేటకు చెందిన ఝాన్సీ (26) శనివారం సాయంత్రం బైక్‌పై పెంచల కోనకు వెళ్లి తిరిగి ఆదివారం ఉదయం స్వగ్రామాలకు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఝాన్సీ అక్కడికక్కడే మృతిచెందగా, గాయాలతో ఉన్న నరసింహులును 108లో బద్వేలు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మర్రిపాడు ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని కేసు నమోదుచేశారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం బద్వేల్‌కు తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	100
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	204

కోడిగుడ్ల ధర (100) : 420

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9213
వెండి కిలో ధర	రూ.98,400
వెండి ఒక గ్రాము	రూ.101.40

జీవిత మథనమే కథ : రచయిత పొట్లూరి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో మథనపడిన సంఘటనలకు అక్షర రూపమే కథ అని రచయిత పొట్లూరి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం జిల్లా గ్రంథాలయంలో సింహపురి రచయితల సంఘం సమావేశం జరిగింది. కథలు ఎలా రాయాలి, కథ లక్షణాలను రచయితలు అభిప్రాయాలు వెల్లడించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంతర్జాతీయ రచయితల కథల గురించి వివరించారు. కార్యక్రమంలో పాతూరి అన్నపూర్ణ, అవ్వారు శ్రీధర్‌బాబు, ఈతకోట సుబ్బారావు, గంగిశెట్టి శివకుమార్, జయప్రకాష్, తోట సులోచన, గాయత్రి, శాంతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అలరించిన సంగీత విభావరి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కేత అంకులు మెమోరియల్ ట్రస్ట్ 35వ వార్షికోత్సవం సందర్భంగా టౌన్‌హాల్‌లో ఆది వారం సంగీత విభావరి, నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఐక్యరాజ్య సమితి భగవద్గీతను, నాట్య శాస్త్రాన్ని గుర్తించడంపై సభికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేతా ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, డ్యాన్స్ మాస్టర్ రమణయ్య, ఎన్ మానస, ఎన్ సాహితి, జీ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : షిరిడీ సాయిబాబా జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం బాలాజీనగర్ అద్దాల సాయి మందిరంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సాయిదర్బార్ యువసేవాదళ్ సభ్యుడు కసుమూరు సాయినాథ్ రెడ్డి జ్ఞాపకార్థం ఈ శిబిరం ఏర్పాటు చేశారు. యువకులు స్వచ్ఛంగా రక్తదానం చేశారు.

వృద్ధ జంటకు వీల్‌చైర్ వితరణ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నివసిస్తున్న వృద్ధ దంపతులకు ఆదివారం గణేష్ మిత్రమండలి వారు దాతల సహకారంతో వీల్ చైర్, కొంత నగదు వితరణ చేశారు. మిత్రమండలి అధ్యక్షుడు గాలి శ్రీధర్ మాట్లాడుతూ ఆ వృద్ధ దంపతులు చెట్ల కింద జీవనం సాగిస్తుండటంతో సహాయం చేశామని చెప్పారు. కార్యక్రమంలో కొట్టి బాలాజీ, ప్రసాద్, సాయి, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియంలో వైద్యశిబిరం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీధర్‌రెడ్డి వాకర్స్‌కు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలిచ్చారు. సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, అధ్యక్షు డు కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి నారాయణరెడ్డి, కోశాధికారి ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

● స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ హర్షవర్ధన్ పాల్గొని చర్మ సంబంధిత వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పీ సత్యం, కార్యదర్శి సురేష్, మాజీ అధ్యక్షుడు వేలూరి రంగారావు, నాయకులు పాల్గొన్నారు.

24న జిల్లా మహాసభ

నెల్లూరు (సాంస్కృతికం). ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కస్) జిల్లా మహాసభ ఈనెల 24న నగరంలో సరస్వతీ నగర్‌లోని చెన్నై హాస్పిటల్ ఇన్స్పిరేషన్ సెంటర్‌లో జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమేష్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10గంటలకు జరిగే ఈ సభలో, ఇటీవల ఉగాది పురస్కారాలు అందుకున్న వారిని సత్కరిస్తామని తెలిపా రు. నూతన కార్యక్రమం ఎన్నిక జరుగుతుందని, సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

కోవూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శారాబిలాక్ మెమోరియల్ సెంటినరీ చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయకాలపు రుద్ధరణ ఆరాధనను పాస్టర్ రాజేష్ నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా రెవరెండ్ ప్రేమనాథ్ హాజరయ్యారు. వాక్య సందేశాన్ని దావులూరి దివ్య అందించారు. అనంతరం చర్చి ఆవరణలో మొక్కల్ని నాటారు. కార్య క్రమంలో పాస్టర్ రెవ రెండ్ దావులూరి రాజేష్, చైర్మన్ కాకాణి రత్నానంద్ రావు, వైస్ చైర్మన్ షైలా ఫ్రాన్సిస్, సెక్రటరీ తుమ్మల పెంట మోహన్, కోశాధికారి నావూరు కు మార్ పాల్గొన్నారు.

'కామాక్షి' సన్నిధిలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఈ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చీఫ్ ఇంజనీర్ ఎల్.వెంకటరమణ దంపతులు ఆదివారం మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయిని దర్శించుకున్నారు. ముందుగా అర్చకులు వారికి ఆలయ మర్యాద లతో స్వాగతం పలికి పూజలు చేసి శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వదించారు.

ఆలయ అధ్యక్షుడిగా వాకాటి

పొదలకూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం లో ఆదివారం అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. పోటీల్లో వాకాటి రాఘవేంద్ర రావు, ఆదూరు సుబ్బుపై 165ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు వాకాటిని అభినందించారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు

● ప్రత్యేక పూజలు, అన్నదానాలు ● భారీ కేక్ కట్టింగ్‌లు, చీరల పంపిణీ



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ పుట్టినరోజును ఆదివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వాడవాడలా అట్టహాసంగా జన్మదిన వేడుకలు జరిపారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అల్పాహారం, అన్నదానాలు, చీరలు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి,



భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

తాళ్లపాక అనురాధ, జెన్ని రమణయ్య పాల్గొన్నారు.

● జేమ్స్‌గార్డెన్‌లోని నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. భారీ కేక్ కట్‌చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నాయకుడు దార్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు అస్మ మైనుద్దీన్, గోగుల నాగరాజు, నిశ్చల్ కుమార్‌రెడ్డి, వడ్లపూడి చంద్ర, అల్లంపాటి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, 47వ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో కంసాలివీధి శివాల యంలో చంద్రబాబు నాయుడు పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. భారీ కేక్ కట్ చేసి పంచారు. నాయకులు ముప్పసాని శ్రీనివాసులు, సాధన రత్నం, రమేష్, విగ్రహాల రవి, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంస్థ డైరెక్టర్ కంచి జ్ఞానేంద్ర ఆధ్వర్యంలో నవాబుపేట శ్రీకృష్ణ ధర్మరాజుల స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ, పాకాల పెంచలయ్య, కువ్వారపు నాగేశ్వరరావు, కొండ్రగుంట సురేష్, మినుకు చంద్రమౌళి పాల్గొన్నారు.

● బీసీ నాయకుడు కప్పిరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంతపేట ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

● చంద్రబాబుసేన అధ్యక్షుడు గుమ్మడిపూడి కల్యాణ్ ఆధ్వర్యంలో కోటమిట్ట మహాలక్ష్మి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అభయ ఆంజనేయ స్వామికి 108 టెంకాయలు కొట్టారు. భారీ కేక్‌ను కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఆర్‌కేటీ రాజా, ఆరణి జయశంకర్, వేలూరు రాజా, అల్లంపాటి వెంకటరమణ, లక్ష్మి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో...

నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్‌చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబాటులో ఉన్న రాష్ట్రాన్ని తన అపారమైన అనుభవంతో చంద్రబాబు ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. ఆయన సారథ్యంలో రాష్ట్రం మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఈవో వీ గిరికృష్ణలు చంద్రబాబు గోత్ర నామాలతో పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

● నెల్లూరు (హరనాథపురం,ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ నేత కనకట్ల రఘురాం ముదిరాజ్ ఆధ్వర్యంలో స్టేడియంలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. పాబోలు సత్యం, వేలూరు రంగారావు, దాసరి అనంత రామారావు, దద్దోలు రమణయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రసాదాలు పంచుతున్న ధర్మవరం సుబ్బారావు



మహాలక్ష్మీ ఆలయంలో పూజ చేయిస్తున్న నాయకులు

ప్రైవేట్ పాఠశాలలు నిబద్ధతతో పనిచేయాలి

● వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి



మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలన్నీ నిబద్ధతతో పనిచేసి విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి కోరారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్స) జిల్లా, నియోజకవర్గాల కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఆయన అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రైవేటు పాఠశాలల ఉన్నతికి ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. జిల్లా లో కూడా మంత్రి నారాయణతో చర్చించి ప్రైవేట్ స్కూళ్ల టీచర్లకు ఇళ్ల నిర్మాణం, నగరంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహ ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అప్స రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రాజు, మాజీ అధ్యక్షుడు సుందరం, జిల్లా గౌరవా ధ్యక్షుడు చాట్ల నరసింహారావు, అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి, నగరాధ్యక్షుడు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర విద్యార్థులకు త్వరలో ప్రతిభా పురస్కారాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనరావు

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : కుమ్మర కుల విద్యార్థులను ప్రోత్సాహించేందుకు త్వరలో ప్రతిభా పురస్కారాలు అందచేస్తామని నెల్లూరు జిల్లా శాలివాహనుల సంక్షేమ భవన పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి మధుసూదనరావు తెలిపారు. కొత్తూరులోని ఆ సంక్షేమ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో 75 శాతం, ఆపైన మార్కులు సాధించిన కుమ్మర కుల విద్యార్థులకు పురస్కారాలు ఇవ్వాలని కమిటీ నిర్ణయించినట్లు చెప్పారు. అర్హులైన విద్యార్థులు 8332911297 నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ కార్యదర్శి పెళ్లూరు సుమన్ ప్రజాపతి, కోశాధికారి ఐనకోట రఘురామయ్య, కార్యవర్గ సభ్యులు ఈదూరు మధు,గూడూరు వెంకటేశ్వర్లు, బెజవాడ ఆదిశేషయ్య పాల్గొన్నారు.

నాగార్పమ్మకు వెండి కవచాలు

పొదలకూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యో తి):సూరాయపాలెం శ్రీనాగార్పమ్మకు అదే గ్రామానికి చెందిన దామినేని బుజ్జయ్య నాయుడు రూ.6లక్షల విలువైన 5.5కేజీల వెండితో అమ్మవారి విగ్రహానికి కవచాలను తయారు చేయించారు. వీటిని ఆలయ పూ జారికి అందజేశారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

అంబేడ్కర్ ఆశయాలను గౌరవిస్తున్నది బీజేపీయే

● ఆదోని శాసనసభ్యుడు పార్థసారథి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను గౌరవిస్తున్నది బీజేపీయే అని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. నగరంలోని గోమతినగర్‌లో ఉన్న ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం మేధావుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ జాతి గర్వించదగ్గ మహనీయుడు అంబేడ్కర్‌ను అడుగడుగునా అవమానపరిచిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. 1998లో వాజపేయి ప్రతిపాద నతోనే అంబేడ్కర్‌కు భారతరత్న గౌరవం లభించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీ ధర్‌రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్‌డీ విల్సన్, డాక్టర్ ఏవీ రెడ్డి, కమల, భరత్‌కుమార్, ఆంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా చంద్రబాబు జన్మదినం

● కేట్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

● పలుచోట్ల పేదలకు అన్నదానం

పొదలకూరు ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలో మండల నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. అలాగే స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, కోవూరు బక్కయ్యనాయుడు, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్ననాయుడు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, బోగోలు భాస్కర్‌రెడ్డి, కరియాల శ్రీనివాసులు, మద్దిరెశ్ల నరసింహులు యాదవ్, కృష్ణ యాదవ్, కలగట్ల సందీప్, సాధం గిరీష్, అనిల్‌కుమార్, విష్ణు, వీరేంద్ర పాల్గొన్నారు.

●విడవలూరు (ఆంధ్రజ్యోతి):స్థానిక సినిమా హాల్ సెంటర్‌లో జరిగిన వేడుకలో మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి ఈస్టన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, తెలుగు యువత నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చెము కుల కృష్ణచైతన్య, నాయకులు చెముకుల శ్రీనివాసులు, పొన్నలూరు పురందర్ రెడ్డి, చలంచర్ల కామేశ్వరి, పూండ్ల ఎసోబు పాల్గొన్నారు. ఊటుకూరులో తెలుగుయువత నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో, గాదెలదిన్నెలో టీడీపీ నాయకులు దిలీప్ ఆధ్వర్యంలో, ముదివర్తిలో ఎస్.కె.రఫీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. రామతీర్థం, వావిళ్ల, అన్నారెడ్డిపాళెం, దంపూరులో నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీతో జరిగిన వేడుకలో టీడీపీ, జనసేన, బీజేపీ(కూటమి) నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్కుసెంటర్‌లో ఏర్పాటు చేసిన వేడుకలో పేదలు, వికలాంగులు, రోగులకు అన్నదానం, పోషకాహారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, నాయకులు ఎంవీ. శేషయ్య, బత్తల హరికృష్ణ, కోదండరామిరెడ్డి, రామానాయుడు, సుబ్ర మణ్యం నాయుడు, హరనాథ్, తాళ్ల వైష్ణవి, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్ నాయుడు, దశరథ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, దళిత, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీఎం గోత్ర నామాలతో జొన్నవాడ ఆలయంలో మల్లికార్జునస్వామి, కామాక్షితాయికి ఆలయ ఈఓ ఏవీ శ్రీనివాసులు రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

● ఇందుకూరుపేట (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల కన్వీనర్ వీరేంద్ర చౌదరి కొత్తూరు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఇందుకూరుపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునగాల రంగారావు, గంపల అనిల్ కుమార్, కోవూరు మధు, రాంప్రసాద్, చింతపంటి వెంకటరమణయ్య, బాలబొమ్మ వెంకటేశ్వర్లు, షేక్ అకీం, రామచంద్రయ్య, పరందామయ్య పాల్గొ న్నారు. అలాగే జగదేవిపేటలో కూకటి వెంక టేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదా నం నిర్వహించారు. కార్యక్రమంలో పొన్నెబోయిన చెంచు కిషోర్ యాదవ్, పీఎల్.రావు, ఇంతియాజ్, బొద్దుకూరు సుధాకర్, అవ్వారు ఏడుకొండలు, గోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

● కోవూరు (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారుకూడలిలో కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంతా మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్, పొబ్బారెడ్డి మల్లికార్జున రెడ్డి, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకలో టీడీపీ పార్ల మెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి కేకు కట్ చేశారు. కార్యక్రమంలో పంతంగి రామారావు, బుధవరపు శివకుమార్, కలికి సత్య నారాయణ రెడ్డి, అజిగంటి రమణయ్య, ఇందుపూరు మురళీకృష్ణారెడ్డి, నరసింహ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జ్యూడ్స్ మానసిక వికలాంగుల కేంద్రంలో తెలుగురైతు రాష్ట్ర ప్రధానకార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. తొలుత చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కూటమి నేతల సమక్షంలో మానసిక చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బొమ్మి సురేంద్ర, కుంకాల నాగేంద్రప్రసాద్, కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, చల్లా నాగార్జున్‌రెడ్డి, వల్లూరు రమేష్‌నాయుడు, ఈపూరు మురళీధర్‌రెడ్డి, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, కోదండయ్య నాయుడు, ఈపూరు సుబ్బారెడ్డి, సురేష్‌నాయుడు, సతీష్‌నాయుడు, బాబురెడ్డి, శ్రీనితారెడ్డి ఉన్నారు. అలాగే కసుమూరు మస్తాన్ వలి దర్గాలో పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈదగా లిలో సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, సీనియర్ నేత కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

● రాపూరు (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేకు కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం ఆలయాల్లో 101టెంకాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కొండ్లపూడి రాఘవరెడ్డి, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పచ్చగళ్ల రత్నయ్య, పట్టణ అధ్యక్షుడు ఏదోటి కోటినాయుడు, బత్తిన శ్రీహరిరెడ్డి, సయ్యద్ ఖాజా మొహిద్దీన్, రవణమ్మ, జనసేన నాయకురాలు కొండాపురం కస్తూరి, టీడీపీ సీనియర్ నాయకులు నల్లవడ్ల వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ వీరేంద్రచౌదరి తదితరులు



విడవలూరు: కేక్ కట్ చేస్తున్న నాయకులు



పొదలకూరు: కేక్ కట్ చేస్తున్న 'దేశం' నాయకులు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

రాపూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం విద్యార్థులు, గ్రామస్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్రంలో ఉపయోగించే పలు పరికరాలను చూపుతూ వాటి పనితీరును వివరించారు. ఉపయోగించే విధానం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాపూరు స్టేట్‌బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి వి.కుప్పయ్య మాట్లాడుతూ వారం రోజుల పాటు పాఠశాలలు, అపార్ట్‌మెంట్‌లు, వైద్యశాలలతో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేసి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎల్ఎఫ్‌లు సుధాకర్ వర్ధన్, శ్రీనివాసులు, నారాయణ, డిఓపిలు సూర్యనారాయణ, షాజహాన్, ఎఫ్ఎంలు వెంకటేశ్వర్లు, అబ్దుల్ బాసీద్, హరి, పెంచలయ్య, చంద్రకుమార్ పాల్గొన్నారు.

● మనుబోలు, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆటో సెంటర్ వద్ద ఏఎంసీ చైర్మన్, టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య, పొన్నూరు రామకృష్ణయ్య, మస్తాన్‌నాయుడు, మధునాయుడు, కిరణ్‌కుమార్, పచ్చిపాల రామిరెడ్డి, నూనెల కృష్ణయ్య, నాగేశ్వరరావు, విజయభాస్కర్‌రెడ్డి, రాజాగౌడ్, రమేష్‌రెడ్డి, ప్రసాద్, చిన్న, అమీర్ బాషా, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● కొడవలూరు, (ఆంధ్రజ్యోతి):నార్తు రాజుపాలెం, కొడవలూరు, యల్లాయపాలెంలో రాష్ట్ర నాయకుడు శేఖర్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కరకటి మల్లికార్జున, కేతు వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అనంతరం రాజుపాలెంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహించారు. కార్యక్రమంలో చెక్క మదన్, జొన్న శివ, నాపా వెంకటేశ్వర్లునాయుడు, బడుగు శ్రీనివాసులు, తువ్వర ప్రవీణ్ పాల్గొన్నారు.



కోవూరు: రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



బుచ్చి: కేక్ కట్ చేస్తున్న నాయకులు



రాపూరు: వేడుకల్లో పాల్గొన్న నాయకులు



మనుబోలులో కేక్ కట్ చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు





క్యూలో భక్తులతో మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి



అఖిలాండం వద్ద..



సర్వ దర్శన క్యూలైనులో వేచి ఉన్న భక్తులు

'కొండ'ంత భక్తజనం

వరుసగా మూడు రోజుల సెలవులు. ఇంటర్ పరీక్షల ఫలితాలు వెల్లడి కావడం.. ఈ క్రమంలో తిరుమలలో నెలకొన్న రద్దీ ఆదివారమూ కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు సర్వదర్శన భక్తులకు శ్రీవారి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. కాగా, ఆదివారం రాత్రి సర్వదర్శన క్యూలైన్లను అదనపు ఈవో వెంకయ్య చౌదరి పరిశీలించారు. టీబీసీ, ఏటీసీ వద్ద క్యూలైన్లలో భక్తులకు చేసిన ఏర్పాట్లను చూశారు. మొబైల్ ఫుడ్ వెహికల్స్‌ను పరిశీలించి భక్తులకు ఇబ్బంది లేకుండా అన్నప్రసాదాలను అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నూతనంగా ప్రారంభించిన మొబైల్ ఫుడ్ వెహికల్స్ ద్వారా భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తున్నామన్నారు. సర్వదర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం, స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు కలిగిన భక్తులకు ప్రణాళికబద్ధంగా సమన్వయంతో దర్శనాలు కల్పిస్తున్నామని తెలిపారు. శ్రీవారి దర్శన టోకెన్లు, టికెట్లు కలిగిన భక్తులు నిర్దేశిత సమయంలోనే క్యూలైన్‌లోకి ప్రవేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఈవో రాజేంద్ర, వీజీవో సురేంద్ర, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి



గదుల కోసం సీఆర్వో వద్ద భక్తుల రద్దీ

ఆశల మెగా డీఎస్సీ


వచ్చేసింది..!

- విడుదలైన నోటిఫికేషన్
- రోస్టర్‌తో పోస్టుల్లో స్పష్టత
- జూన్, జూలైలో పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చేసింది. అధికారంలోకి వస్తే తాము మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నిలబెట్టుకుంది. ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ఏడాదిలోనే నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వం భావించినా, ఎస్సీ వర్గీకరణ అడ్డురావడంతో కొంత సమయం పట్టింది. అయినా, గత ఏడాది టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) నిర్వహించి.. నవంబరులోనే ఫలితాలు విడుదల చేసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణకు జైకొట్టిన ప్రభుత్వం డీఎస్సీకీ సై చెప్పింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లోని మొత్తం ఖాళీలు.. 1478 భర్తీ చేయనున్నారు. వీటిల్లో.. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ, వ్యాయామ) 1,473 పోస్టులుండగా, ట్రైబల్ వెల్ఫేర్ (ఆశ్రమ) పాఠశాలల్లో మరో ఐదు పోస్టులు (మ్యాథ్స్ 1, ఫిజిక్స్ 1, బయాలజీ 1, ఎస్జీటీ 2) ఉన్నాయి.

షెడ్యూల్ ఇలా..

ఆదివారం నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ, ఫీజు చెల్లింపు ఉంటుంది. మే 20 నుంచి ఆన్‌లైన్ మాక్ టెస్టు అందుబాటులో ఉంటుంది. మే 30వ తేదీనుంచి ఆన్‌లైన్‌లో డీఎస్సీ అభ్యర్థులు పరీక్షల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 6 నుంచి జూలై 6వ తేదీ వరకు సబ్జెక్టుల వారీగా మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి పరీక్ష అనంతరం రెండ్రోజుల్లో 'కీ'ని విడుదల చేస్తారు. ఏడు రోజుల అనంతరం ఫైనల్ 'కీ' విడుదలవుతుంది. ఆ తర్వాత ఏడు రోజులకు డీఎస్సీ మెరిట్ (మార్క్ మెమో)వి డుదల చేయనున్నారు.



రోస్టర్ వారీగా పోస్టుల వివరాలిలా..

కేటగిరీ	ప్రభుత్వ స్థానిక యాజమాన్యం	మున్సిపల్	మున్సిపల్ కార్పొరేషన్	మొత్తం
ఓసీ	511	26	41	578
బీసీ-ఏ	94	6	11	111
బీసీ-బీ	127	5	7	139
బీసీ-సీ	18	1	0	19
బీసీ-డీ	91	5	6	102
బీసీ-ఈ	48	2	3	53
ఎస్సీ-గ్రేడ్ 1	16	1	4	21
ఎస్సీ-గ్రేడ్ 2	84	4	6	94
ఎస్సీ-గ్రేడ్ 3	102	4	6	112
ఎస్టీ	85	5	5	95
ఈడబ్ల్యూఎస్	125	5	8	138
పీహెచ్-విజువల్	1	0	0	1
పీహెచ్-హియర్	10	0	0	10
ట్రైబల్ వెల్ఫేర్ (ఆశ్రమ)	5	0	0	5
	1317	64	97	1478

నిబంధనలకు విరుద్ధంగా
నగదు బదిలీ

- రేణిగుంట ఏపీఎంకు షోకాజ్

రేణిగుంట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్(ఎంఎస్ కోఆర్డినేషన్)గా విధులు నిర్వహిస్తున్న పళని కుమార్‌కు డీఆర్‌డీఏ జిల్లా అధికారి శ్రీనివాస్ ప్రసాద్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఏర్పేడు ఏపీఎంగా ఉన్నప్పుడు 1, 2 గ్రామ సంఘాల్లో జమ చేయాల్సిన ఆసరా నిధిని బయట వ్యక్తుల ఖాతాకు బదిలీ చేశారు. గ్రామ సంఘాల నిధుల నుంచి అదనంగా వీవోఏలకు గౌరవ వేతనం చెల్లించడం, కొన్ని సంఘాల్లో వీవోఏలు లేకపోయినా గౌరవవేతనం ఇవ్వడం, సంఘాల నుంచి రుణాలు వసూలు కాకుండానే శ్రీనిధి, ఎస్‌వీఈపీ రుణాలకు గ్రామ సంఘం నుంచి బదిలీ చేసినట్టు ఫిర్యాదులందాయి. ఇలా రూ.26,70,648 బదిలీ చేయడంపై విచారణ చేపట్టిన అధికారులు డీఆర్‌డీఏ అధికారికి నివేదిక పంపారు. ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని పళనికుమార్‌కు షోకాజు నోటీసులు జారీ చేశారు.

క్రమశిక్షణ గల విద్యార్థి..
దార్శనికత గల నాయకుడు



తిరుమలలో కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నాయకులు



అలిపిరి గోశాలలో శ్రీకృష్ణుడికి టీడీపీ నేతల పూజలు

- సీఎం చంద్రబాబు నాయుడు 75వ పుట్టిన రోజు వేడుకల్లో వక్తలు
- చదువుకున్న ఎస్వీ యూనివర్సిటీలో చంద్రబాబుకు విశిష్ట గౌరవం



ఎస్వీయూ సెనేట్ హాలులో కేక్ కట్ చేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, పూర్వ విద్యార్థులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ గల విద్యార్థి.. దార్శనికత గల నాయకుడిగా ఎదిగారని చంద్రబాబు నాయుడును ఆయన 75వ పుట్టినరోజు సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం భారీ కేక్ కట్ చేసి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సభాధ్యక్షత వహించిన శాప్ చైరన్ రవినాయుడు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడి జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచీ ఎదిగిన ఆయన ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, అంకిత భావంతోనే చంద్రబాబు నాయుడు ఈ స్థాయికి వచ్చారని చెప్పారు. చంద్రబాబు నాయుడికి స్కూల్, కాలేజ్, యూనివర్సిటీ దశల్లో స్నేహితులుగా, సన్నిహితంగా మెలిగిన అనేకమంది ఈ సభలో తమ జ్ఞాపకాలను, అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం తరపున పాకనాటి హరికృష్ణ, పత్తిపాటి వివేక్, శేషాద్రి నాయుడు, రాంబాబు నాయుడు, భువనేష్ చౌదరి, మురళీ మోహన్, డాక్టర్ దూపాటి ఉదయ్‌కుమార్, చంద్రప్రకాష్, అంజన్‌సింగ్, రంగనాథ్, ఆనంద్‌గౌడ్, రామ్మోహన్, ఆర్కే నాయుడు, మహేష్‌యాదవ్, ఉదయభాస్కర్, ఎన్ఎంఆర్ ఉద్యోగ సంఘం నేత జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన 'ఆంధ్రజ్యోతి- ఐఆర్ఎంఎస్'
ఎడ్యుకేషన్ ఎక్స్‌పో

- వందలాదిగా తరలివచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు

తిరుపతి(విద్య/రూరల్), ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): తిరుపతినగరంలో ఆంధ్రజ్యోతి- ఐఆర్ఎంఎస్ (ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్) సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఎడ్యుకేషన్ ఎక్స్‌పో ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఇంటర్మీడియట్ లేదా ప్రీడిగ్రీ తర్వాత ఏ కోర్సు చేయాలనే సందిగ్ధంలో ఉన్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈఎక్స్‌పోను సందర్శించి.. ఆయా విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, కోర్సుల వ్యవధి, వాటి ఫీజులు వంటి వివరాలను తెలుసుకున్నారు. విదేశీవిద్యకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రముఖ విద్యాసంస్థల స్టాళ్ల సహాయకులతో నేరుగా మాట్లాడి సవివరంగా తెలుసుకున్నారు. దక్షిణ భారతదేశంలో ప్రతిష్ఠాత్మక 30 విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, కన్సల్టెన్సీ ఏజన్సీలు హాజరవగా..నగరంలోని పలు విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సులు చదువుతున్న వందలాదిమంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు సందర్శించారు.



అపూర్వ స్పందన

జిల్లాతోపాటు నగరంలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తల రాకతో ఎక్స్‌పోకు అపూర్వ స్పందన లభించింది. ఏకకాలంలో దక్షిణ భారతదేశంలోని ఇన్ని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకొచ్చి సమగ్ర విద్యా సమాచారాన్ని అందించిన ఆంధ్రజ్యోతి-ఐఆర్ఎంఎస్ ఎక్స్‌పోకు విశేష ఆదరణ లభించింది. ఎక్స్‌పోను సందర్శించే వారికోసం ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్(ఐఆర్ఎంఎస్)ఫౌండర్ అండ్ సీఈవో రాజ.సి, టర్న్‌కీ ఈవెంట్స్ ఫౌండర్ అండ్ సీఈవో రాధాక్రిష్ణన్ టీకే నేతృత్వంలో అన్ని ఏర్పాట్లను చేశారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్(ఐఆర్ఎంఎస్)ఫౌండర్ అండ్ సీఈవో రాజ.సి, టర్న్‌కీ ఈవెంట్స్ ఫౌండర్ అండ్ సీఈవో రాధాక్రిష్ణన్ టీకేకు ఆంధ్రజ్యోతి యాజమాన్యం తరపున తిరుపతి బ్రాంచ్ మేనేజర్ సురేష్‌రెడ్డి జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు


గూడూరు కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, ఆహార పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, శ్రీదేవి, నరసింహులు, వెంకటేశ్వర్లురెడ్డి, తీగల సురేష్‌బాబు, జనార్దనరెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని రైల్వేగేటు వద్దనున్న టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్‌కట్ చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేసి అన్నదానం చేశారు. అదే విధంగా ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, మునిరాజా, అశోక్‌రెడ్డి, విజయమ్మ, బుజ్జయ్య, బీజేపీ నేతలు ఆదినారాయణరెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని కొత్తూరు టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. పేదలకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. అదేవిధంగా పెళ్లకూరులో పేరం రమేష్ నాయుడు, మధునాయుడు, వేలూరు మురళీ కృష్ణారెడ్డి, శిరసనంబేడులో వేలూరు కల్యాణ్‌రెడ్డి, బంగారంపేటలో పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, జీలపాటూరులో ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు జరిగాయి. పేదలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ కొండల్‌రావు, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు మధన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, నరేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని రాణీపేటలో ఉన్న బాలల సదన్‌లో చిన్నారుల నడుమ టీడీపీ నేత గంగోటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. చిన్నారుల చేత కేక్ కట్ చేయించారు. అన్నదానం చేశారు. అంతకుముందు గ్రామశక్తి పోలేరమ్మ దేవస్థానం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజ, బీరం రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాథ నాయుడు, చంద్రమౌళిరెడ్డి గొల్లగుంట వెంకటముని, నరసింహులు, జీకేపల్లి బాబు నాయుడు, ఆవుల ప్రహలాద, మురళి, నాగరాజు పాల్గొన్నారు.

తడ: మండల కేంద్రంలోని బజారు కూడలిలో టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి ఆధ్వర్యంలో, వాటంబేడుకుప్పం గ్రామంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, కారూరులో మత్స్యకార నాయకులు సుందరమూర్తి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో నీలకంఠం, సెల్వం, ఫణి, రవి, సుధాకర్, ఏకాంబ్రం, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, పవిత్రారెడ్డి, పాదర్తి ప్రకాశ్‌నాయుడు, ఎద్దల సుధాకర్‌రెడ్డి, షేక్ రఫీ, శంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద సీఎం చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ 75 కేజీల కేక్‌ను కట్ చేశారు. అనంతరం మహిళలకు చీర, జాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తడ జట్పీటీసీ ఇందుమతి, వైసీపీ నాయకులు గోపాల్ రత్నం మణి, రాజా, తదితరులు ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజక ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దార్ల రాజేంద్ర, అవధానం సుధీర్, నానాబాల సుబ్బారావు, బీవీఆర్ నాయుడు, రాజేష్, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వెంకటగిరిలోని బాలల సదన్‌లో చిన్నారుల చేత కేక్ కట్ చేయిస్తున్న టీడీపీ నాయకులు


పెళ్లకూరు మండలంలోని కొత్తూరులో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

చిల్లకూరు: స్థానిక డానియేల్ చిల్డ్రన్స్ హోమ్‌లో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేశారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు వెంకటేష్, దినేష్‌వర్మ, జగదీష్, సుమంత్, జవీన్‌కుమార్, ప్రశాంత్, సతీష్, ధనుష్ పాల్గొన్నారు.

బాలాయపల్లి: స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో దాసరి రాజగోపాల్ నాయుడు, రాయి సత్యం నాయుడు, కొర్రపాటి రామచంద్ర నాయుడు, తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, ముప్పాళ్ల గురువేంద్ర, శివ, వేళ్ల సురేంద్ర రెడ్డి, మాదవనాయుడు, సాగి నరసింహులు నాయుడు, మారెళ్ల వెంకటాద్రి, జనార్దనరెడ్డి, దాసరి కోటేశ్వరావు, మురళి పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని ఆర్టీసీ సెంటర్‌లో సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్ స్టాండు వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మధుయాదవ్, పోలయ్య, వాకా విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, మస్తాన్‌బాషా, తూపిలి రాధాకృష్ణారెడ్డి, కోటేశ్వరరావు, కోటారెడ్డి, దారా సురేష్, షంషుద్దీన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: స్థానిక టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. శ్రీనివాసులునాయుడు, శ్రీహరిరెడ్డి, షబ్బీర్, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

వాకాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను టీడీపీ మండల అధ్యక్షులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి సన్నారెడ్డి విజయ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణమూర్తి, శ్రీనివాసులురెడ్డి, ప్రమీల, శ్రీనివాసులు, ద్వారకనాథ రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు
ప్రయాణికులకు తృటిలో తప్పిన ప్రమాదం


ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు - బయటకు కనిపిస్తున్న ఇనుప ఊచలు

నాయుడుపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం శ్లాబ్ పెచ్చులు ఊడి పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుని శ్లాబ్ ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. తరచూ శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతోంది. గతంలో శ్లాబ్ పెచ్చులూడి పడి ప్రయాణికులు గాయాలయ్యాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ శ్లాబ్‌కు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

కనులపండువగా సీతారాముల కల్యాణం


తాళిబొట్టును చూపుతున్న వేదపండితుడు

చిల్లకూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు జరిపి స్థానికుల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ సీతారాముల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం బాణసంచా పేలుళ్లు, కోలాటాల నడుమ సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు.

సైనికుల్లా పని చేయాలి


చిట్టేడులో జనసేన జెండాఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

కోట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త రెట్టింపు ఉత్సాహంతో పార్టీ ప్రతిష్టత కోసం సైనికుల్లా పనిచేయాలని జనసేన నాయకుడు కొణిదల మునిగిరీష్ కోరారు. మండలంలోని చిట్టేడు ఆర్టీసీ సెంటర్‌లో ఆదివారం జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు మండలాల నాయకుల సమక్షంలో పార్టీ జెండాను ఆవిష్కరించి లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, చంద్రనీల్, ఇంద్రనీల్, అల్లం బాబు, అనిల్, హరీష్, శశి, మణి, పరంధామ్, కోట, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్కి భూములను స్వాధీనం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న హేతువాద సంఘ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, పక్కన రాజు, వెంకటరమణ తదితరులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కల్కి భగవాన్ ఆశ్రమం ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని భారత హేతువాద సంఘ అధ్యక్షుడు నార్ని వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం సూళ్లూరుపేటలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వరదయ్యపాలెం వద్ద ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూముల్లో కల్కి ఆశ్రమాలు నిర్మించారని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బీఎన్ కండ్రిగ మండలం కళ్లిపెట్టు గ్రామం వద్ద సర్వే నెంబరు 295లో దాదాపు 21 ఎకరాలు అటవీభూమి ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. అటవీ భూములను కాపాడాలన్నారు. కార్యక్రమంలో హేతువాద సంఘ నాయకులు రాజు, వెంకటరమణ, మునిచంద్రయ్య, రాము, పోలయ్య పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


టీడీపీలో చేరిన వారితో మంత్రి ఆనం, ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల

నాయుడుపేట, నాయుడుపేట టౌన్ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటకు చెందిన మాజీ సర్పంచు గోనిపల్లి గురుమూర్తి, కొట్లపూడి రాజేష్‌తో పాటు మరో వంద మంది వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నాయుడుపేట మండలంలోని పుదూరు మినీ ఫంక్షన్ హాల్లో ఆదివారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు మంత్రి ఆనం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, సీనియర్ నాయకులు విజయభాస్కరరెడ్డి, మున్సిపల్ వైస్ చెర్మన్ రఫీ, మధురెడ్డి, ఆకుతోట రమేష్, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, రమేష్ నాయుడు, చంద్రారెడ్డి, దార్ల రాజేంద్ర, విజయకుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు

గూడూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మునిగిరీష్ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యుడు మునిగిరీష్, వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, పవన్‌కుమార్, రాదయ్య, శ్రీనివాసాచారి, జనా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజా వీధిలో ఉన్న ఆర్వీఎం ఉన్నత పాఠశాల వద్ద మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు.

భువనేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం


కల్యాణోత్సవంలో పార్వతి పరమేశ్వర్లు

తడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేకం వేడుకలు ఆదివారం ముగిశాయి. శుక్రవారం మొదలైన ఈ కార్యక్రమాలను ఆదివారం సాయంత్రం పార్వతి, పరమేశ్వరుల కల్యాణంతో ముగించారు. ముందుగా తెల్లవారుజామున గణపతి పూజ, ధన్వంతరి హోమం, మృత్యుంజయ హోమం, మహాపూర్ణాహుతి, శిఖరమహాకుంభాభిషేకం, చతుర్వేద పారాయణం నిర్వహించారు. అనంతరం కలశ జలాలతో ఆలయ శిఖర కలశాలను అభిషేకించి మహాకుంభాభిషేం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి


సామాజిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ నాయకులు

నాయుడుపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఆస్పత్రిలో బ్లడ్ స్టోరేజ్, డయాలసిస్ యూనిట్, వాటర్ ప్లాంట్, కరెంటు సౌకర్యం, ప్రహరీ తదితర సమస్యలను ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగినేని కృష్ణయ్య, అమరావతి రామయ్య, విజయ భాస్కర్, ఆశ చెంచుకృష్ణయ్య, కొప్పోలు సుబ్రమణ్యం, చిగురాకుల సురేంద్ర, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థికి చేయూత

నాయుడుపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నాయుడుపేటకు చెందిన గాయత్రి తిరుపతిలోని పద్మావతి మహిళా కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆమె తల్లిదండ్రులు నిరుపేదలు కావడంతో విద్యాభ్యాసం కోసం ఎమ్మెల్యే విజయశ్రీ రూ.25 వేలు అందజేశారు.

మాస్టర్స్ తైక్వాండో క్లబ్ ప్రారంభం


తైక్వాండో క్రీడాకారులతో మున్సిపల్ వైస్ చెర్మన్ రఫీ

నాయుడుపేట టౌన్ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట బేరిపేటలో మాస్టర్స్ తైక్వాండో క్లబ్‌ను మున్సిపల్ వైస్ చెర్మన్ షేక్ రఫీ ఆదివారం ప్రారంభించారు. చిన్నారులకు ఉచితంగా తైక్వాండో శిక్షణ ఇచ్చి వారి స్వీయ రక్షణకు తోడ్పడుతున్న మాస్టర్స్ తైక్వాండో క్లబ్ వ్యవస్థాపకుడు ఉయ్యాల పవన్ కుమారన్‌ను అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోచ్ వినోద్ కుమార్, అబ్రాత్, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకారంలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పాలక మండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బాలిక ఆత్మహత్య

చిల్లకూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) మండలంలోని బూదనం గ్రామానికి చెందిన మహాలక్ష్మి(16) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మహాలక్ష్మిని ఆమె స్నేహితురాలి కుటుంబ సభ్యులు తమ బిడ్డను చెడగొడుతున్నావని మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన మహాలక్ష్మి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈస్టర్ ప్రార్థనలు

ఓజిలి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఓజిలిలోని సెయింట్ జాన్స్ చర్చిలో పాస్టర్ రాజారత్నం ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రార్థనలు జరిగాయి. అదేవిధంగా కురుగొండ, వెంకటరెడ్డిపాళెం, కుందాం, అత్తివరం, ఆరిమేనిపాడు, చిల్లమానుచేను, పెద్దపరియ తదితర గ్రామాల్లోని చర్చిల్లో కూడా ప్రార్థనలు నిర్వహించారు.

గూడూరు: ఈస్టర్ డే సందర్భంగా పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా స్థానిక ప్రార్థనా మందిరం, హోసన్న మందిరం చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు.

కోట: మండలంలోని అల్లంపాడు, కోట, విద్యానగర్, గూడలి, తిన్నెలపూడి గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను జరుపుకున్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


సభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్‌వో రమణయ్య

నాయుడుపేట టౌన్ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రమణయ్య అన్నారు. ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. వంట గదుల్లో గాలి, వెలుతురు బాగా ఉండేలా చూసుకోవాలన్నారు. వంట గ్యాస్ లీకైనట్టు అనుమానం వస్తే ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్ చేయకూడదని, రెగ్యులేటర్‌ను తక్షణమే ఆపేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ఎంలు చంద్రబాబు, రామకృష్ణ, సందీప్, నాగరాజు, రవీంద్రరెడ్డి, పోలయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఇళ్లలో అగ్నిప్రమాదాలు జరిగినపుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అగ్నిమాపక అధికారి హరీష్, నరసింహం, వెంకటసుబ్బయ్య, శ్రీహరి, దుర్గాప్రసాద్, సునీల్, నాగరాజు, వినయ్, దేశయ్య పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్దనరెడ్డి, దశరథరామిరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, మధుసూదనరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల అందజేత

గూడూరు అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు పుట్టిరోజు సందర్భంగా అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు ఆహార పొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్, రవి కుమార్, శ్రీనివాసులు, సురేంద్రబాబు, కరిముల్లా పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

గూడూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం జైన్ సంఘం ఆధ్వర్యంలో చెన్నై మెట్రో మహావీర్ క్లబ్ సహకారంతో తిరుపతికి చెందిన ఎస్వీ ఆరవింద కంటి ఆస్పత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. పేదలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు, కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మిచంద్, అరుణ్ నహర్, రమేష్ కుమార్, సతీష్, జ్ఞానచంద్, సుభాష్‌చంద్, అజిత్, బొమ్మిడి శ్రీనివాసులు, అశోక్ కుమార్, అభిషేక్ కుమార్ పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వాహనం ఢీకొని తమిళనాడువాసికి గాయాలు

తడ ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. తమిళనాడు పల్వరుకాడుకు చెందిన చంద్రశేఖర్ ఆదివారం సూళ్లూరుపేటలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బైక్‌పై బయలుదేరాడు. తడ బోడిలింగాలపాడు వద్దకు గుర్తుతెలియని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌కు కాలు విరిగి గాయాలయ్యాయి. 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తీసుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

టిడ్కో ఇళ్ల వద్ద కార్డన్ సెర్చ్


వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న టిడ్కో ఇళ్ల వద్ద ఆదివారం సీఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 11 మోటర్ సైకిళ్లు, 5 ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట ప్రాంతాలకు వెళ్లే వారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుబ్బారావు, శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటపోలూరులో...

సూళ్లూరుపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ చెంచుబాబు అన్నారు. మండల పరిధిలోని కోటపోలూరు ఈస్ట్ హరిజనవాడలో ఆదివారం సీఐ మురళీకృష్ణ, ఎస్ఐలు పోలీసు సిబ్బందితో కలిసి డీఎస్పీ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 180 ఇళ్లలో తనిఖీలు నిర్వహించి వాహనాలకు సంబంధించిన వాహనాలను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని నాలుగు వాహనాలను సీజ్ చేశారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో తడ, సూళ్లూరుపేట, శ్రీహరికోట ఎస్ఐలు కొండప నాయుడు, వేటూరి బ్రహ్మనాయుడు, శ్రీకాంత్, ఏఎస్ఐ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులికాట్‌ను సందర్శించిన కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి రీనా నగర్ ఆదివారం ఫారెస్టు అధికారులతో కలిసి పులికాట్ సరస్సును సందర్శించారు. ఆమెకు తిరుపతి అటవీశాఖ ముఖ్య అధికారి సి.శెల్వం, సూళ్లూరురుపేట డీఎఫ్‌వో ఈ.హారిక పులికాట్ సరస్సుకు వలస వచ్చే పక్షులు, సరస్సు ప్రాముఖ్యం గురించి వివరించారు. అనంతరం అట్టకానితిప్పలోని పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని రీనా నగర్ సందర్శించారు.


పులికాట్‌ను పరిశీలిస్తున్న రీనా నగర్, పక్కన డీఎఫ్‌వో హారిక తదితరులు

దుకాణాల్లో తనిఖీలు

వాకాడు,ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) వాకాడు మండలంలో తూనికలు, కొలతలు శాఖ ఇన్స్‌పెక్టర్ మల్లీశ్వర్ ఆధ్వర్యంలో ఆశాఖ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. అధిక ధరలకు విక్రయించడం, తూకంలో తేడాలు ఉండడం, కాలం చెల్లిన తినుబండారాలను తనిఖీ చేశారు. కొన్ని దుకాణాల్లో తూకాల్లో తేడాలు ఉండడంతో కేసులు నమోదు చేశారు.